# కల మలచిన కథ

స్వామీరావు అజంతా ఎల్లోరాల్ని చూసేందుకని బయలుదేరాడు. విద్యావతి కూడా అతనివెంట వస్తానంది. అతను వద్దనలేదు. అలాంటి శిథిలాల్ని చూసేటప్పుడు, కూడా భార్య ఉంటే బావుంటుంది అని అతనికి తోచింది. అదీకాక తన భార్యలో అజంతా పోలికలున్నాయని అతను మురిసి పోతుంటాడు ఆమెను ఆ చిత్రాల మధ్య నిలబెట్టి చూడాలనిపించింది.

విద్యావతి అతనికి తగిన భార్య. చిత్రకారుని ఎదురుగా ఎప్పుడూ అంద మైన రూపం ఉండాలి అనే అభిప్రాయానికి తగినట్టుగా అందమయిన, కోమల మైన, పొడుగాటి శరీరం ఆమెది. భర్త చిత్రాల్లో తన రూపాన్ని చూసుకున్న ప్పుడు తను యింత అందమైనదా అని విస్తుపోతుంటుంది. కేవలం స్వార్థపరు రాలుగా తన అందాన్ని తనలోనే యిమిడ్చేసుకోలేదు భర్త గురించని అందంగా అలంకరించుకొని అతనిముందు నిలిచేది. భర్త అభివృద్ధికి తన అందం దోహదం కావాలని ఆమె కోరిక.

ఇద్దరూ బయలుదేరారు. ఔరంగాబాదు స్టేషను చేరేసరికి రాత్రయింది. స్టేషనుకు దగ్గర్లో హోటలు ఒకటి ఉంది. ఆ హోటల్లో దిగారు.

అలసిపోయి ఉండడంవల్ల స్నానంచేసి భోజనం చెయ్యగానే నిద్ర వచ్చేసింది. ఉదయం బాగా పొద్దెక్కిన తర్వాతగాని లేవలేదు. స్నానంచేసి, కాఫీ టిఫిను పుచ్చుకొని బయలుదేరారు. వాళ్ళు వెళ్ళేసరికి ఫస్టుబస్సు దాటి పోయింది. తర్వాత బస్సుకు వెళ్ళొచ్చని ఎదురుచూస్తూ కూర్చున్నారు.

అరగంట గడిచింది. మరో అరగంటకుగాని బస్సు కదలదు. అతని కేమీ తోచడంలేదు స్కెచ్ పుస్తకం తీశాడు ఒకరో ఒకామె బస్సు దగ్గరగా నుంచొని ఉంది. అతను ఆమె స్కెచ్ గీయబోయాడు. ఆ విషయం ఆమె

గుర్తించినట్టుంది. ముఖం అవతలకు తిప్పేసింది. అతను స్కెచ్ పుస్తకం అలా వదలి సిగరెట్టుతీసి వెలిగించాడు. కాలుస్తూ కూర్చున్నాడు.

ఒక ముష్టిది—పాతికేళ్ళన్నా లేవు—యౌవ్వనం హరించుకుపోయిన శరీరంతో అతని ముందుకొచ్చి చెయ్యి చాపింది. అతను తలెత్తి చూశాడు. ఆమె ముఖంలో, కళ్ళ చివర్లో, ముక్కు మొనలో ఏదో అందం ఉంది. వర్షం నీరు జారిపోయినా యింకా ఆకును అంటిపెట్టుకొన్న ఆఖరి నీటిబొట్టులాగా, కన్నీరు కారిపోయినా కనుగొలకుల్లో నిలిచిపోయిన చిట్టచివరి దుఃఖాశ్రువులాగా యౌవ్వనం నాశనమైనా సౌందర్యం యింకా ఆమెలో అక్కడక్కడ కనిపిస్తూనే ఉంది. ఉన్నతమైన ఆమె వక్షాలు శిథిలమైన వస్త్రాల్ని దాటి నాగరికతలోకి పొడుచుకొచ్చాయి. చీకటిలో పాపాలు దాగినట్టు మాలిన్యం పేరుకున్న బట్టల్లో కుళ్ళిపోతున్న ఆమె శరీరం దాగివుంది.

జాలిగా ఆమెను చూసి, పర్సుతీసి ఓ అణా ఆమె చేతిలో పెట్టాడు. ఆమె అక్కడినుండి కదిలిపోయింది. మరో చోటికి వెళ్ళి యాచిస్తోంది. అతనికి ఏమి తట్టిందో గబుక్కున స్కెచ్ పుస్తకం తెరిచి నాలుగైదు చిత్రాలు ఆమెవి గీశాడు.

బస్సు కదలబోతున్నదని కండక్టరు కేకవేశాడు. స్వామీరావు, భార్య వెళ్ళి బస్సెక్కారు. జనాన్ని నింపుకొని బస్సు కదిలింది. ఎండ నడినెత్తి మీదకు వచ్చేసరికి అజంతా చేరుకున్నారు

అక్కడ నాగరికతకు దూరంగా చిన్నరకం హోటలు ఒకటి ఉంది. నాగరీకులు అనుకునేవారు ఆ హోటల్లోకి—తాటాకు పాకలోకి—వెళ్ళడానికి భయపడతారు.

నాగరికతకు, సౌందర్యానికి సన్నిహితత్వాన్ని చెప్పడం అతనికి నచ్చదు. సౌందర్యం అంటే వస్తువుల్ని మలినం లేకుండా చూపించడం అన్న అభిప్రాయంతో అతను ఏ మాత్రమూ ఏకీభవించడు. ఈ ఆధునిక వాదం అతన్ని బాధపెడుతూంటుంది.

నాగరీకుడ్ని అని చెప్పుకునే మానవుడ్ని చూస్తే అతనికి అసహ్యం. "అందంగా టాయిలెట్ కావడమే నాగరికత లక్షణంకాదు. గడ్డిపువ్వు

అందాన్ని, తుఫానులోని సంగీతాన్ని, ఆకలితో అరుస్తోన్న సింహం కంఠంలోని మాధుర్యాన్ని గుర్తించగలిగే సున్నిత హృదయం ఉండాలి. అదే నాగరీకుడి లక్షణం" అంటాడు.

ఈనాటి మానవుడి నాగరికతను అతను ఏ మాత్రమూ హర్షించలేడు. ఏళ్ళతరబడి సమాధిలో నిద్రిస్తోన్న బీజం చూసిన కల, నిద్రమత్తులోంచి ఆకాశంకేసి చూస్తోన్న గడ్డిపువ్వు కళ్ళల్లోని బరువు, అజంతా రాళ్ళల్లో బంధించిన హృదయాల స్పందన, తాజ్‌మహల్ అట్టడుగున జవరాలి నిట్టూర్పుల భూకంపం, పిరమిడ్లలో పాలిపోయిన రత్నాలు వెలుతురు చూడాలనే ఆవేదన—యివేమీ గుర్తించని మానవుడు నాగరికతలోకి, సూర్యుడు చంద్రుడు నక్షత్రాలు మండిపోయే వెలుతుర్లోకి, అణువులు కాలుతోన్న చితిలోకి నడుస్తున్నాడని అతని అభిప్రాయం.

నాగరికతకు దూరంగా నిలబడ్డ ఆ హోటలులో భోజనంచేసి గుహలు చూద్దామని బయలుదేరారు. స్వామీరావు తనవెంట స్కెచ్ పుస్తకం పట్టుకొచ్చాడు. గుహలన్నీ అర్ధచంద్రాకారంలో ఉన్నాయి. గుర్రపునాడా జ్ఞాపకానికి వచ్చింది.

లోపలికి వెళ్ళారు. శిల్పాల్ని, చిత్రాల్ని చూస్తూ అతను తన్నుతాను మర్చిపోయేవాడు. అతని ముఖంలో సంతోషం, బాధ, ఆశ్చర్యం—ఏవేవో చేరి, జారిపోయి, మళ్ళీ వచ్చి—ఎలాగెలాగో అతన్ని మార్చేసి—ఎక్కడికెక్కడికో అతన్ని లాక్కుపోతున్నాయి. బొమ్మల్ని చూస్తూ భార్య ముఖంలోకి ఆనందంగా, పిచ్చిగా చూస్తూ బొమ్మలు గీస్తూ మెల్లగా కదులుతున్నాడు. ఆమె మౌనంగా అనుసరిస్తోంది. అక్కడ అన్నీ చిత్రాలే. అక్కడక్కడ శిల్పాలున్నాయి.

స్వామీరావు ఓ విగ్రహం ముందు ఆగిపోయాడు. చూస్తూ నుంచుండిపోయాడు. ఒక నర్తకి విగ్రహం అది. ఆ కళ్ళల్లో వెలుగు, ఆ పెదవులమధ్య చిరునవ్వు, ఆ ముఖం, ఆ వక్షోజాలు ఎక్కడో ఎప్పుడో చూసినట్టు, ఏ కలలోనో కనుపించినట్టు, తనకు సన్నిహితమైనట్టు అనిపిస్తున్నాయి. చప్పున తను వేసిన ముష్టిది జ్ఞాపకం వచ్చింది. కాగితాలు తిరగవేశాడు. ఆమె స్కెచ్‌లు తీశాడు. ఆ కళ్ళు, పెదవులు, ముఖం—అన్నీ అలానే ఉన్నాయి.

అతనికి బాధ కలిగింది. తన యౌవ్వనాన్ని నాశనం చేసుకున్న ఆమెమీద అసహ్యం పుట్టింది. జాలిపడ్డాడు. ఆ యౌవ్వనం ఉండి ఉంటే ఆమె అందానికి అవధులు ఉండేవేకావు. మరీ అందంగా, కోమలంగా అజంతా సుందరుల్ని మించిపోయి ఉండేది. ఆ చిత్రం గీసుకున్నాడు.

మరొచోటికి వెళ్ళాడు. అక్కడ ఒక సేవకురాలి విగ్రహం ఉంది. ఆ కళ్ళల్లో ఏదో బరువు, ఆ ముఖంలో ఏదో విచారం నిండివున్నట్టున్నాయి.

"విద్యా! ఆ బొమ్మ చూడు" అన్నాడతను.

ఆమె చూసింది.

"అచ్చం నీలానే ఉంది" అన్నాడు.

ఆమె నవ్వింది. అక్కడనుంచి కదిలిపోయింది. లోపల ఉక్క పోస్తోంది కాబోలు, బయటకు వచ్చి కూర్చుంది ఆమె. అతను స్కెచ్ వేసుకొని ఆమె దగ్గరకు వచ్చి కూర్చున్నాడు.

"ఇంతేనా అజంతా అంతా" అంది ఆమె.

"ఊఁ" అన్నాడతను. "ఎల్లోరా కూడా వుంది. ఔరంగాబాదు వెళ్ళే వెళ్ళాలి" అన్నాడు. అక్కడ తొందరగా తెమిలి ఎల్లోరాకు బయలుదేరారు. ఎల్లోరా గుహలు విశాలంగా విస్తరించి వున్నాయి. వాటినిండా శిల్పాలే. సాయంకాలం అయ్యేవరకూ చూస్తూనే వున్నారు. బాగా అలసిపోయినట్టున్నారు. బయటికివచ్చి రాళ్ళమీద కూర్చున్నారు. అతనికి బాపిరాజు చెప్పిన విషయం జ్ఞాపకానికి వచ్చింది. ఇక్కడ అస్తమిస్తున్న సూర్యుని తప్పక చూసితీరాలట! అతను ఆకాశంలోకి చూశాడు.

మేఘాలు గుంపులు గుంపులుగా కదులుతున్నాయి. నల్లని చీరను తప్పించుకొని అక్కడక్కడ బయటపడ్డ శరీరంలాగా ఆకాశం కనిపిస్తోంది. మంచితనాన్ని కప్పేసిన మాలిన్యంలాగా సూర్యుడు మబ్బులో ఉండిపోయాడు. ఎర్రని ఒక కిరణం చీకటిని చీలుస్తూ దారి వెతుక్కుంటూ వచ్చి కొండమీద వాలింది. ఆ వాలిన కిరణం మరీ ఎర్రగా పండి పాలిపోయి మాయమయ్యింది, క్రొద్దికొద్దిగా చీకటి ఆవరించింది. అంతలోనే కొండలు, గుహలు—అన్నీ చీకటి పూతలోంచి, ఆ ప్పుడే మబ్బుల్ని తప్పించుకొస్తోన్న చంద్రుడి వెలుతుర్లోకి.

చీకటి కరిగిపోయిన కాంతిలోకి, కలలో కనుపించే ఏదో చెప్పలేని ప్రకాశం లోకి వచ్చి మెరుస్తున్నాయి.

అక్కడినుంచి వాళ్ళు వెళ్ళిపోదామని లేచారు. ఏడున్నరకు బస్సు ఉంది. అది దాటిపోతే ఆ రాత్రంతా అక్కడే గడపవలసి వస్తుంది. గబగబా నడుస్తున్నారు. ఆమె వేగంగా నడవలేక అతని చేతిని పట్టుకొని అడుగులు పెద్దవి వేస్తోంది. రాళ్ళు, గుట్టలు దాటుకొని నడుస్తున్నారు. నగ్నంగా నిద్ర పోతోన్న స్త్రీలా మెలికలు తిరిగిన ఎండిపోయిన చిన్న కొండకాలువను దాటి బాటమీదకు వచ్చారు. హోటలు చేరుకునేసరికి యింకా బస్సు బయలుదేరలేదు. అతను ఈలోగా భోజనం చేద్దామన్నాడు. ఆమెకు ఆకలిగా లేదు. చెయ్యనంది. పాలు మాత్రం పుచ్చుకొంది. అతనుకూడా చెయ్యలేదు. ఔరంగాబాదులో చెయొచ్చని ఊరుకున్నాడు.

ఔరంగాబాదు చేరుకునేసరికి చాలా రాత్రయ్యింది. బాగా అలసిపోయి ఉన్నారు. వెంటనే అక్కడినుండి బయలుదేరడం యిష్టంలేక హోటల్లో ఉండి పోయి మరుసటిరోజు బయలుదేరవచ్చని అనుకున్నారు. ఆమె అలానే అంది.

హోటలుకు వెళ్ళడంతోనే ముందుగా స్నానంచేసి కాస్త రొట్టెమాత్రం పుచ్చుకొని నిద్రపోయింది ఆమె. అంత రాత్రప్పుడు భోజనం చెయ్యడం యిష్టంలేక అతనుకూడా పాలు పుచ్చుకున్నాడు. నిద్ర వేగంగా పట్టలేదు. చూసిన ప్రతీ చిత్రం ఒక్కొక్కటీ పదేసిసార్లు కళ్ళముందుకొచ్చి ఒకదానిలో ఒకటి కలిసి ఏమీలేని రూపమై, చీకటై, మళ్ళీ వెలుతురు చారపడి ఏదో రూపమై ఎలాగెలాగో కనుపిస్తోంది.

మెల్లగా అన్ని రూపాలూపోయి, అన్ని ఆలోచనలూ మాయమై కొద్దిగా మగత నిద్ర....అంతలోకే నల్లికుట్టిన బాధ....స్టేషన్లో భారంగా యీడ్చుకొని పోతున్న యింజను కూసిన అరుపు....కొద్దికొద్దిగా నిద్ర....నిద్రలోంచి దురద గోక్కొంటోన్న స్పర్శ....మళ్ళీ జాగ్రదావస్థ ...ఏదో కల.

అతను నిమిషాల తరబడి చూస్తూ నుంచుండిపోయిన విగ్రహం కదిలి, కుంచించుకపోయి, మెలికలు తిరిగి మనిషై అతనిముందుకొచ్చి నవ్వబోయి ఏడ్చి కన్నీరు జలజలా రాల్చేసింది. అతను ఆశ్చర్యపోతూ చూస్తూ ఉండి పోయాడు.

ఆమె ఎక్కిళ్ళుపడుతూ ఏడ్చి తేరుకొని "స్వామీ ఇంకా నన్ను గుర్తు పట్టలేదా? నేను....మీ ప్రియురాలిని....'నీలిమ'ను, రెండువేల సంవత్సరాల కిందట మీరూ నేనూ సరదాగా కలిసి తిరిగాం, గుర్తులేదా!" అంది.

అతను జ్ఞాపకం తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. ఆమె తిరిగి చెప్తోంది.

"ఆనాడు మనం ఒకరి చేతుల్ని ఒకరు గట్టిగా వేళ్ళతో బంధించుకొని ఎత్తయిన రాళ్ళను తప్పించుకొని సెలయేటి నీళ్ళల్లో అడ్డంగా పరుగెత్తి విశాలమైన పొలాల్లోకి పారిపోయేవాళ్ళం. మీరు నన్ను వెంబడించేవారు. నేను మిమ్మల్ని వెంబడించేదాన్ని. మీరు ఆశ్రమంలో కూర్చొని శిల్పం చెక్కుతూంటే మీ సుత్తి లయిలో పాదాలు కదిపి నాట్యం చేసేదాన్ని. నేను నాట్యం చేస్తూ ఉంటే మీరు నా రూపాన్ని చెక్కుతూ కూర్చుండిపోయేవారు. మీరు రాజశిల్పి అయ్యారు. మీ శిల్పాల్ని చూసి మహారాజు మెచ్చుకున్నాడు. మీరు నిర్మించిన నాట్యశాల ప్రారంభించే రోజున మీ మెళ్ళో రత్నహారాలు రాలాయి. ఆ ఆనందాన్ని ఒక్కరూ భరించలేక మీరు నన్ను మహారాజు ఎదుట నిలిపారు. మీ కృషికి కారణం నేనే అని పొగిడారు. నాచేత గజ్జెకట్టి ఆడించారు. మహారాజు మెచ్చుకున్నాడు. మహామంత్రి స్వయంగా సింహాసనం దిగివచ్చి మరకత మాణిక్యాల్ని తాపిన హారాన్ని నా మెళ్ళో వేశాడు. అందరి ఎదుటా ఘనంగా శ్లాఘించాడు ఆ తర్వాత నేను రాజ నర్తకినయ్యాను. స్వామీ! నేను పాపిష్టిదాన్ని. మహామంత్రి వలలో పడిపోయాను. ఒకరోజు—నాకు బాగా జ్ఞాపకం—అది తలచుకొంటుంటే యింకా నాకు ఏడుపు వస్తోంది.

"ఒకరోజు నేను నిద్రపోతున్నాను. మీరువచ్చి నన్ను లేపారు. నిద్ర మత్తులోంచి 'ఎక్కడకు?' అన్నాను. మీవెంట రమ్మన్నారు. వచ్చాను. నన్ను దూరంగా కొండమీదకు లాక్కుపోయారు. మనం పరుగెత్తిన రాళ్ళమధ్య కూర్చోబెట్టారు. మిమ్మల్ని పెళ్ళిచేసుకోమని ప్రాధేయపడ్డారు. ఇక్కడ నుంచి పారిపోదామన్నారు. జాలిగా అడిగారు. ఏడ్చారు. నేను వప్పుకోలేదు. భయ పెట్టారు కత్తితీసి జడిపించారు. భయపడ్డాను. 'అలానే' అన్నాను. అమాయకులు మీరు! నా మాటలు నమ్మి మోసపోయారు. వెన్నలాంటి హృదయం మీది. మీఅంత మంచివారు ఎవరూ ఉండరు. పాపిష్టిదాన్ని. మిమ్మల్ని మోస గించాను. బాధపెట్టాను...."

ఆమెకు దుఃఖం ఆగలేదు. గట్టిగా కళ్ళు మూసుకొని ఏడుస్తూ కూర్చుంది. చాలా సేపు అలా ఏడ్చిఏడ్చి కన్నీళ్ళు వత్తుకొని మళ్ళీ చెప్పడం ప్రారంభించింది.

"మీకు చాలా అన్యాయం చేశాను మీరు గుర్రంమీద ఎక్కించుకొని పారిపోతుండగా 'దొంగ దొంగ' అని గట్టిగా అరిచాను. భటులువచ్చి మిమ్మల్ని పట్టుకున్నారు బలవంతంగా లాక్కుపోతున్నాడని మహారాజుతో ఫిర్యాదు చేశాను. మీకు ఉరిశిక్ష వేయలేక మహారాజు దయతలచి దేశంనుంచి వెడలగొట్టారు."

"స్వామీ! మీకు మహాపకారం చేశాను. మీ జీవితాన్ని చీకటిమయంచేసి మీ ఆశలకు సమాధుల్ని కట్టి మిమ్మ పిచ్చివాడ్ని చేశాను. మీరు పిచ్చివాడిగా దేశాలన్నీ తిరుగుతూ ఉంటే నేను విచిత్రంగా నవ్వుకునేదాన్ని. కనుపించిన రాతి మీదల్లా నా రూపాన్నే చెక్కుతుండేవారు మీరు. మీలో కళను ఎవరో గుర్తించారు. ఇక్కడకు చేర్చారు. నిద్రాహారాలు మాని చెక్కుతూ కూర్చుండి పోయేవారు. ఒకసారి శిల్పం చెక్కుతున్నప్పుడు ముఖం తిరిగి మీరు పడిపోతే యిక్కడ పరికరాల్ని అందించే పనిపిల్ల మిమ్మల్ని చూసి జాలిపడి, మీ ముఖంమీద నీళ్ళు చిలకరించింది. మీకు తెలివి వచ్చేవరకూ వీస్తూ కూర్చుంది. ఆ తర్వాత గంజి కాచి తెచ్చింది. రోజూ మీకు సేవలుచేస్తూ మీ దగ్గరే కూర్చునేది. మీ కళ్ళల్లోకి చూస్తూ మీ రూపాన్నే తలచుకొంటూ గడిపేది. మీరామె రూపాన్ని చెక్కారు. ఆమె ఉప్పొంగిపోయింది. తన అందం మరొకరికి ఉపయోగపడుతున్నందుకు తను ధన్యురాలిని అనుకుంది. 'ఈయన్ను విడిచిపెట్టను. ఈయన పాదాల దగ్గరే పడిఉంటాను'అనుకుంది. కాని ఆమె ఊహలు నెరవేరలేదు. ఒకరోజు మీరు నా పాదాలదగ్గర కళ్ళుమూసి శాశ్వతంగా నిద్రపోయారు."

"మీకు అన్యాయం చేసినందుకు దేవుడు నాకు తగిన శిక్ష విధించాడు స్వామీ! ఇంతవరకూ నాకా శిక్షనుండి విముక్తి దొరకలేదు. ఒక జన్మలో నేను విషసర్పాన్ని; మీరు డేగ. మరో జన్మలో నేను జింకను; మీరు మహారాజు. ఇంకో జన్మలో నేను గడ్డి దుబ్బును ; మీరు పంచకల్యాణి. మరొక్కప్పుడు నేను హంతకురాలిని; మీరు న్యాయాధికారి—ఇలా ఎన్నో జన్మలు గడిచాయి. నాకు ముక్తిలేదు. ఆ పాప ఫలం నన్ను యింకా తరుముతూనే ఉంది. ఈ జన్మలో ముష్టిదాన్ని....

"....ఆరోజున మీ బాగోగుల్ని చూస్తూ మీ పాదాల దగ్గర పడివున్న ఆ పనిపిల్ల చాలా అదృష్టవంతురాలు ప్రతీ జన్మలో మిమ్మంటిపెట్టుకొనే ఉంటోంది. మీ పెంపుడు కుక్కగా, మీతో కలిసి విహరించే తోటి జింకగా, స్నేహితురాలిగా, సేవకురాలిగా మీతోనే ఉంటోంది. ఈ జన్మలో ఆమె మీ భార్య !........"

* * *

కల కరిగిపోయింది. ఏదో నల్లికుట్టిన బాధ....కొద్దికొద్దిగా నిద్రమత్తు తేలిపోయిన స్థితి....విద్యావతి ప్రక్కకు వత్తిగిల్లిన శబ్దం....రైలుబండి కూత.

లేచి కూర్చున్నాడు. డాబామీదకు వచ్చి చూస్తూ నుంచున్నాడు. అంతా చీకటిగా ఉంది. ఏమీ కనిపించడంలేదు. గదిలోకి వచ్చి పడుకున్నాడు. నిద్ర పట్టడంలేదు. రకరకాల రూపాలు, ఊహలు, కలలో విన్న శబ్దాలు అతని చుట్టూచేరి, కదలి, శబ్దంచేసి, అరచి, గోలగా, సందడిగా, తుఫానులా కలగా పులగం అయిపోతున్నాయి.

తెల్లవారిపోయింది. ముఖం కడిగి, స్నానమన్నా చెయ్యకుండా "ఇప్పుడే వస్తా"నని విద్యావతితో చెప్పి బస్సుస్టేండు వద్దకు వచ్చాడు. ఆ ప్రదేశమంతా వెతికాడు. నిన్నటి ముష్టిది ఎక్కడా కనుపించలేదు. మరో ముష్టివాడ్ని పిలిచి అడిగాడు. ఆమె ఎవరో అతనికి సరిగా తెలియదట. అప్పుడప్పుడు నాలుగైదు నెలల కొకసారి కనుపిస్తుందట. ఆలా అలా అడుక్కొంటూ ఒకచోటినుండి మరో చోటికి పోతుందట.

అతను ఊరిలో అక్కడక్కడ వెతికాడు. కాళ్ళు నొప్పి పుట్టాయి. వెనక్కి వచ్చేశాడు. విద్యావతి స్నానంచేసి వంగపండు చీర కట్టుకొని అతని గురించే ఎదురు చూస్తోంది. "బండి వచ్చే టయిము కావస్తోంది. ఇంతవరకూ ఎక్కడకు వెళ్ళారు ?" అంది. అతను ఏదో సమాధానం చెప్పి స్నానంచేసి వచ్చాడు. కాఫీ పుచ్చుకొని స్టేషను చేరుకున్నారు.

బండి వచ్చింది స్వామీరావు కిటికీముందు కూర్చున్నాడు. ఆమె అతని ప్రక్కనే కూర్చుంది. బండి కదిలింది స్టేషను వచ్చినచోట ఆగి మళ్ళీ పరుగెత్తుతోంది. బండి ఆగినప్పుడల్లా అతని కళ్ళు స్టేషన్లోని జనంలోకి పరుగెత్తి ముష్టిదాన్ని వెతుకుతూనే ఉన్నాయి.

(1960)

★